క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి సహకరించాలి


పెదపూడిలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గ్రామ పంచాయతీ వద్ద శనివారం చట్టబద్ధమైన గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి, ప్రస్తుతం జరుగుతున్న పనులను వివరించారు. ఏ వనరుల ద్వారా ఎంత ఆదాయం వస్తుంది, గ్రామాభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, సచివాలయ కార్యదర్శి జి.ఉషారాణి, గ్రామ నాయకుడు ఆరుమిల్లి అమ్మన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి

పెదపూడి: స్వాతంత్ర సమరయోధుడు, భారత జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ముమ్మిడి శివ అన్నారు. ఏపీత్రయం గ్రామంలో శనివారం పింగళి వెంకయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అడబాల అనురాధ, సచివాలయం కార్యదర్శి తరుణ్, ఎంపీటీసీ సభ్యురాలు పెండెం జ్ఞాన ప్రసూన, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

అనపర్తి: మండలంలోని కుతుకులూరు గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.42,420 స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. స్థానిక టీడీపీ నాయకుడు కనుసన్నల్లో జరుగుతున్న ఈ శిబిరంపై పోలీసు ఉన్నతాధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు పోలీసులు శనివారం దాడి చేశారు. కాగా.. నిందితులను అరెస్టు చేశామని ఎస్సై ఎల్.శ్రీను నాయక్ తెలిపారు.

కల్వర్టు పనుల్లో కదలిక

- వైఎస్సార్ సీపీ ఆందోళనతో స్పందించిన యంత్రాంగం
- నిల్వ నీరు పోయేలా ఏర్పాటు
- సిమెంట్ తూరలు సిద్ధం


చినకొండేపూడి - చీపురుపల్లి రోడ్డులో కల్వర్టు వద్ద తీసి గొయ్యి


కల్వర్టులో ఏర్పాటు చేయడానికి సిద్ధం చేసిన తూరలు

సీతానగరం: చిన కొండేపూడి – చీపురుపల్లి మధ్యలో గల లోకల్వర్టు అభివృద్ధికి కదలిక ఏర్పడింది. అక్కడ కొత్తగా తూరలు వేసి నీటి ప్రవాహం సక్రమంగా పోయేలా చర్యలు తీసుకోనున్నారు. దీనిలో భాగంగా కొత్త సిమెంట్ తూరలను సిద్ధం చేశారు. ముందుగా ఆ రోడ్డు మధ్యలో ప్రొక్లెయిన్‌తో తవ్వి నిల్వ నీరు పోయేలా ఏర్పాట్లు చేశారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు చేసిన ఆందోళనతో అధికార యంత్రాంగం స్పందించింది.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆందోళన

లోకల్వర్టు తూరలు నాలుగు నెలల క్రితం పగిలిపోయాయని, వాటి స్థానంలో తాత్కాలికంగా నైనా తూరలు వేసి, నీరు కిందకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలంటూ వైఎస్సార్ సీపీ రాజానగరం నియోజకవర్గం ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు పోలినాటి ఈశ్వరుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గత నెల 19న లోకల్వర్టు వద్ద రోడ్డుపై టెంట్ వేసి ఆందోళన దిగారు. ఈ సమస్యను అధికారులకు, స్థానిక ఎమ్మెల్యే దృష్టిలో ఉంచినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని, రాబోయే వర్షాకాలంలో పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం గ్రామాల నుంచి వచ్చే నీరు వెళ్ల సుమారు వెయ్యి ఎకరాలు ముంపులోకి వెళతాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక వర్షాలకు రోడ్డుపై నుంచి నీరు వెళ్లడంతో నడవడానికి మార్గం ఉండదని, పెదకొండేపూడి నుంచి పది కిలోమీటర్లు దూరం తిరిగి పంట పొలాలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఎరువులతో పాటు కూలీలను తీసుకువెళ్లడం కూడా కష్టమేనన్నారు.

జక్కంపూడి రాజా కృషితో..

వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో చినకొండేపూడి – చీపురుపల్లి మీదుగా నాగంపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.21 కోట్లు మంజూరయ్యాయి. సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించే పనులు చేపట్టారు. దానిలో భాగంగా కల్వర్టు వద్ద చిన్న వంతెన నిర్మించాల్సి ఉంది. అయితే రోడ్డుపై వెట్‌మిక్స్‌ను వేసి తారు వేయాల్సిన సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి.


గత నెలలో ఆందోళన చేపట్టిన రైతులు (ఫైల్)

రైతులకు కష్టాలే



చినకొండేపూడి – చీపురుపల్లి రోడ్డులోని లోకల్వర్టు వద్ద తాత్కాలిక పనులు చేపట్టకపోతే రైతులకు కష్టాలు తప్పవు. తూరలు తెచ్చి వదిలేశారు. రోడ్డును తవ్వారు. వర్షం నీరు అలాగే వెళుతోంది. వెంటనే తూరలు వేసి దారిని పునఃరుద్ధరించాలి. లేకపోతే పెదకొండేపూడి నుంచి తిరిగి పది కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఈ రోడ్డు ఏర్పాటు చేస్తే అర కిలో మీటరు మాత్రమే ఉంటుంది.

– మేడిశెట్టి త్రిమూర్తులు, రైతు, చినకొండేపూడి

గత నెలలో ఆందోళన



లోకల్వర్టు సమస్యపై గత నెలలో రైతులతో ఆందోళన చేపట్టాం. రాజమహేంద్రవరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అర్జీ అందజేశాం. దీంతో అధికారులు స్పందించి, పనులపై ఆరా తీస్తున్నారు. నాలుగు రోజుల క్రితం తూరలు తెచ్చారు. రోడ్డును తవ్వి అలాగే ఉంచారు. వర్షాలు పడితే నీరు ఎక్కువ అవుతుంది. వెంటనే తూరలు అమర్చాలి.

– పోలినాటి ఈశ్వరుడు, వైఎస్సార్ సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు, చినకొండేపూడి

రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం



చీపురపల్లి– చినకొండేపూడి మధ్యలో అప్పన్న చావిడి వద్ద గల లోకల్వర్టుకు రెండు రోజుల్లో తూరలు అమర్చుతాం. నీరు ఎక్కువగా ఉండటంతో, అది పోవడానికి ప్రొక్లెయిన్‌తో గాడి తీశాం. రెండు రోజుల్లో నీరు తగ్గుముఖం పడుతుంది. అప్పుడు సిమెంట్ తూరలు అమర్చి, రోడ్డు ఏర్పాటు చేస్తాం. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకుంటాం.

– కోనే శ్రీనివాస్, చినకొండేపూడి నీటి సంఘం అధ్యక్షుడు

రాజగోపురం నిర్మాణానికి రూ.50 వేల విరాళం


దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ధర్మకర్త తదితరులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామ శివారు సూర్యనారాయణపురంలోని అలివేలు మంగ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ రాజగోపురం నిర్మాణం కోసం భక్తులు రూ.50 వేల విరాళం అందజేశారు. హేమాద్రిభట్ల రాజన్న, హైమావతి దంపతులు ఈ విరాళాన్ని వంశపారపర్య ధర్మకర్త నల్లమిల్లి పద్మనాభ సత్యనారాయణరెడ్డికి శనివారం అందించారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతు ఆలయ రాజగోపురం నిర్మాణానికి భక్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నల్లమిల్లి మోహనరామ గంగధరరెడ్డి, అర్చకుడు అరవిల్లి రఘురామాచార్యులు పాల్గొన్నారు.

వైభవంగా వారాహి అమ్మవారి గ్రామోత్సవం


వారాహి అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

పెదపూడి: జి.మామిడాడలో వారాహి గుప్త నవరాత్ర ఉత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. వారాహి దుర్గ ద్విశక్తి పీఠం నిర్వాహకులు సిరి మాత సారథ్యంలో ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. పీఠం నుంచి ఉద్వాసన అనంతరం అమ్మవారిని రథంలో ఉంచి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం తుల్యభాగ నదీ పాయలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున అమ్మవారి మాలధారణ గావించిన భక్తులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రణాళిక


కానవరంలో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం: పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల లేఅవుట్లలో అంతర్గత రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను రూపొందించి, ప్రభుత్వానికి పంపించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. మండలంలోని పల్లకడియం, కానవరం, వెలుగుబంద గ్రామాల్లోని లేఅవుట్లను శనివారం ఆమె సందర్శించి, అక్కడ జరుగుతున్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ ఎస్.భాస్కరరెడ్డి, అదనపు మున్సిపల్ కమిషనర్ ఆర్‌వీ రామలింగేశ్వరరావు, తహసీల్దార్ జీఏఎల్ఎస్ దేవి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించాలి

సీతానగరం: మండలంలోని హౌసింగ్ లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి బి.రామ్ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ పురోగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ లే అవుట్లలోని స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందిస్తుందన్నారు. అలాగే బీసీ, ఎస్సీలకు అదనంగా రూ 50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ఇస్తుందన్నారు. దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. పీ 4 కార్యక్రమంపై మండల స్థాయి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 10న జరిగే మెగా పేరెంట్ – టీచర్ మీటింగునకు సంబంధించి ఎంఈవో కె.స్వామి నాయక్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం ఇనుగంటివారిపేటలోని జగనన్న కాలనీని సందర్శించారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలు వేయాలి


కోటపాడులో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి రాజేశ్వరరావు

రంగంపేట: జిల్లాలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా ఇన్‌చార్జి బయ్యావరపు రాజేశ్వరరావు మాదిగ సూచించారు. మండలంలోని కొత్త వీరంపాలెం, వడిశలేరు, కోటపాడు గ్రామాలలో శనివారం రాత్రి ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఇతర అనుబంధ సంఘాల ఏర్పాటు, గ్రామ స్థాయి నుంచి పటిష్ట పరిచే దిశగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ కమిటీలు ఏర్పాటు చేసి, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలను బలోపేతం చేయాలన్నారు. వర్గీకరణ ఫలాలను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలన్నారు. జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో దండోరా దిమ్మలను ఏర్పాటు చేసి దండోరా జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామాల్లో దండోరా జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం వినోద్ మాదిగ, సీనియర్ నాయకుడు కుందేటి వెంకటరమణ, నియోజక ఇన్‌చార్జి దాసరి రవికుమార్, బత్తిన రాజు పాల్గొన్నారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ విస్తృత దాడులు


భూపాలపట్నంలో స్వాధీనం చేసుకున్న 1,205 కిలోల బెల్లంతో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ (ఈఎస్‌టీఎఫ్) అధికారులు, సిబ్బంది శుక్రవారం కోలమూరు, భూపాలపట్నంలో విస్తృత దాడులు నిర్వహించారని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి సీహెచ్ లావణ్య తెలిపారు. ఈ సందర్భంగా 270 లీటర్ల సారా, 1,205 కిలోల బెల్లం, 1,400 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారన్నారు. ఈఎస్‌టీఎఫ్ ఏఈఎస్ పీఎస్ రాహుల్, ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, ఎస్సై రామాంజనేయులు, సిబ్బందితో కలిసి కోలమూరు, భూపాలపట్నంలో విస్తృత దాడులు నిర్వహించారు. కోలమూరుకు చెందిన దాసరి నాగేశ్వరరావు, ఎనుగంటి వెంకటేష్, రఘునాథపురానికి చెందిన గోనబోయిన వాసు, భూపాలపట్నానికి చెందిన రేలంగి నాగమహిలను అరెస్టు చేసి రిమాండ్ పంపారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

ఘనంగా సహకార దినోత్సవం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దేశాభివృద్ధిలో సహకార సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ కళాశాల నుంచి ఆర్యాపురం అర్బన్ బ్యాంకు వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సహకార పతాకావిష్కరణ చేశారు. బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట రమణ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, జీవనోపాధి రంగాల్లో సహకార సంస్థలు అనేక మార్పులు తీసుకొచ్చాయన్నారు. ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు(బాబు), జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ అధికారి ఎం.జగన్నాథరెడ్డి, విభాగ సహకార అధికారి ఎం.కనక దుర్గారెడ్డి పాల్గొన్నారు.

ఆ ఉత్తర్వులు రద్దు చేయాలి

కంబాలచెరువు: త్వరలో పాఠశాలల్లో జరిగే మెగా పీటీఎంలో విట్నెస్ అధికారిని పాఠశాల ఉపాధ్యాయులే నియమించుకుని, వారి చేత వీడియోలు తీయించి అప్‌లోడ్ చేయాలనే విద్యాశాఖ ఉత్తర్వులను తక్షణం రద్దు చేయాలని తూర్పుగోదావరి యూటీఎఫ్, ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఆయా సంఘాల నాయకులు పి.జయకర్, ఎ.షరీఫ్, డేనియల్ బాబు, సువర్ణరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేస్తామని చెప్పి, మొన్నటి వరకూ యోగా కార్యక్రమాలు, ఇప్పుడు పేటీఎం అంటూ బోధనా సమయాన్ని వృథా చేయటం సమంజసం కాదన్నారు. ఇదే వైఖరితో ప్రభుత్వం ముందుకు వెళితే భవిష్యత్తులో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అనంతరం డీఈవోకు వినతిపత్రం ఇచ్చారు.

పోస్టాఫీసు సేవలపై అవగాహన


పోస్టు కార్డులతో ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు

సీతానగరం: వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం పోస్టాఫీసు సేవలపై అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా విద్యార్థులు కొత్త పాఠశాలలో ప్రభుత్వం కల్పించిన సదుపాయాలు, అందించిన యూనిఫాం, టెస్ట్ పుస్తకాలు, నోట్స్, బెల్టులుమొదలైన వాటి గురించి వివరిస్తూ పాఠశాలలో సన్నబియ్యంతో భోజనం అందించడాన్ని కొనియాడుతూ ఎంఈవో, డీఈవోలకు పోస్టుకార్డులు పంపించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం కేసులో ఇద్దరి అరెస్టు

పెదపూడి: బాలిక అదృశ్యం కేసులో ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్సై ఎస్.తులసీరామ్ శనివారం తెలిపారు. రామేశ్వరం గ్రామానికి బాలిక గత నెల 29వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానని చెప్పి అదృశ్యమైంది. బాలిక ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వెదకగా ఎలాంటి ఆచూకీ లభించలేదు. వెంటనే తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. ఈ కేసులో కె.ప్రవీణ్, కె.రామకృష్ణలను అరెస్టు చేసినట్టు ఎస్సై తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బిక్కవోలు: మండలంలోని కాపవరం, బిక్కవోలు, ఊలపల్లి, ఆరికరేవుల గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలోని ఎంపీపీ తేతలి సుమ, ఆరికరేవుల సర్పంచి రెడ్డి నాగ వీరవేణి, ఊలపల్లి సర్పంచి బండారు రమ్య తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపర గ్రామంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఆషాఢ మాసంలో దశమి, శనివారం సందర్భంగా పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి తులసి దళాలతో విశేష, అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.